క్లుప్తంగా

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తోందని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ మాదిగ ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆగస్టు 6, 7 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ దీక్ష కరపత్రాలను గురువారం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. కేంద్రంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు జానయ్య, ప్రధాన కార్యదర్శి సత్యం, కార్యదర్శి కొత్తపల్లి వెంకన్న, నాయకులు పిడమర్తి కమల్, రమేష్, రవీందర్, మామిడి సైదులు, ఒగ్గు రాజు, కాటయ్య, రాంబాబు, వెంకన్న, చిరంజీవి పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు సూర్యాపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడి, సీజ్ చేసిన 6 వాహనాలకు జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట ఉంటుందని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ఉదయం 9 గంటలకు స్టేషన్‌లో ముందుగా ధరావతు చెల్లించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తుంగతుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వెంకటరమణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలను ఆడించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ టీచర్ అనిరెడ్డి పుష్ప, ఆయా పాల్గొన్నారు.

గీత కార్మికులకు బడ్జెట్ కేటాయింపు పెంచాలి

పెన్‌పహాడ్ : కల్లుగీత కార్మికులకు బడ్జెట్ కేటాయింపు పెంచాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలకు రూ.5వేల కోట్లు కేటాయించాలన్నారు.

రక్తహీనత నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంఈఓ

నూతనకల్ : పిల్లల్లో రక్తహీనత నివారణ కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న మాత్రలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాములు నాయక్ అన్నారు. గురువారం యడవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యసిబ్బంది అందజేసిన ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంమోహన్‌రావు, వీరస్వామి, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అర్వపల్లి : ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అర్వపల్లి పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్య అధికారి, కొమ్మాల ప్రత్యేక అధికారి చరణ్ అన్నారు. మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో గురువారం వీధులను పరిశీలించి నీటి పరీక్షలు చేయించారు. అలాగే జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించి పిల్లలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, హెచ్ఎం బి.శేఖర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, కోటమర్తి వెంకన్న, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల్లో జాప్యం.. పనులకు ఆటంకం

- మధ్యలోనే ఆగిపోయిన తుంగతుర్తి వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు
- చేయించిన పనులకు బిల్లులు రాకపోవడంతో నిలిపేసిన కాంట్రాక్టర్
- వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్న ప్రజలు



తుంగతుర్తిలో నిర్మాణ దశలో ఆగిపోయిన ఆస్పత్రి పనులు

తుంగతుర్తి : తుంగతుర్తికి మంజూరైన వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తుంగతుర్తికి మంజూరైన వంద పడకల ఆస్పత్రికి అప్పటి మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌లు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. దీనికోసం రూ.36 కోట్లకు పైగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పట్లో నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్లను కూడా పిలిచి గుత్తేదారును ఎంపిక చేశారు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు జరగలేదు.

నూతన ప్రభుత్వ హయాంలో పనులు..

ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మందుల సామేల్ ఆస్పత్రి నిర్మాణ పనులకు మార్చిలో భూమి పూజ చేశారు. 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు వేగవంతం కావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా గత రెండు నెలల నుంచి గుత్తేదారు నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేశాడు. కాంట్రాక్టరు ఇప్పటివరకు రూ.3కోట్ల మేర పనులు చేయించి బిల్లులను అధికారులకు పంపించారు. కానీ డబ్బులు విడుదల కాకపోవడంతో అతడు చేసేదేమీ లేక పనులను మధ్యలోనే ఆపేశాడు. ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తే పనులు వేగవంతం కానున్నట్లు తెలుస్తోంది.

ఆస్పత్రి పూర్తయితే ఎంతో ప్రయోజనం..

వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయి వినియోగంలోకి వస్తే తుంగతుర్తి ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. రోగులు ప్రతిసారి వైద్యసేవల కోసం సూర్యాపేటకు వెళ్లకుండా తమ ప్రాంతంలోనే వైద్యసేవలు లభిస్తాయి.

ప్రస్తుతం ఓపీ సేవలే..

పాత ఆస్పత్రి సగం కూల్చివేసి వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు చేయిస్తున్నారు. మిగతా సగం ఆస్పత్రి భవనంలో వంద పడకల ఆస్పత్రికి సంబంధించిన సుమారు 30 మందికి పైగా వైద్యసిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను వెంపటికి తరలించారు. ప్రస్తుతం తుంగతుర్తిలోని ఆస్పత్రిలో రోగులకు ఓపీ సేవలు మాత్రమే అందుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు విడుదలచేయించి, వెంటనే పనులు పూర్తిచేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు రావాల్సి ఉంది

ఇప్పటివరకు చేయించిన పనులకు బిల్లులు రాలేదు. దీంతో ఆస్పత్రి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం కోసం రూ.3కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశాం. ప్రభుత్వం నుంచి డబ్బులు రాగానే మళ్లీ పనులు చేపడతాం.

– నవీన్, కాంట్రాక్టర్

ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు

ఆస్పత్రి నిర్మాణ పనులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయిస్తాం.

– లోకిలాల్, టీఎస్ఎంఎస్ఐడీసీ, డీఈఈ, సూర్యాపేట

ఆస్పత్రిలో వైద్యసేవల పరిశీలన



రోగులను వైద్యసేవలపై అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఆర్

భానుపురి : పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రిని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు కావలసిన సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం లయన్స్ హాస్పిటల్ కమిటీ సభ్యులు దామోదర్ రెడ్డిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ దోసపాటి గోపాల్, ట్రెజరర్ చిలుముల శ్రీనివాస్ రెడ్డి, హనుమంతరావు, డాక్టర్ క్రాంతి, మేనేజర్ మల్లికార్జున్, ధరావత్ వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

28న ఖమ్మంలో రవన్న సంతాప సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : ఈ నెల 28వ తేదీన ఖమ్మంలో జరిగే రాయల రవన్న సంతాప సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. గురువారం పట్టణంలోని లెనిన్ నగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 50 ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఎక్కువ కాలం అడవికి తన జీవితాన్ని అంకితం చేసి నిర్బంధాలను ఎదుర్కొన్నారని చెప్పారు. అలాంటి వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, పార్టీ డివిజన్ నాయకులు ఎస్కే. సయ్యద్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వాజీదు, వీరబాబు, సూరం రేణుక, జయమ్మ, అంజయ్య, జానయ్య, గౌరమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి : సీజనల్ వ్యాధులను అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి బండి రవి అన్నారు. పీవైఎల్ ప్రతినిధి బృందం పిలుపు మేరకు గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వైద్యశాఖ సూపరింటెండెంకు వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. సీజనల్ వ్యాధులతో ఎవరైనా మృతి చెందితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ నాయకులు వీరబోయిన లింగయ్య, దండి ప్రవీణ్, భీమ్ రెడ్డి, వినయ్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం



సూర్యాపేట టౌన్ : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



భానుపురి : సూర్యాపేటలో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేటటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ అన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయాన్ని నిరసిస్తూ స్థానిక 60 ఫీట్ రోడ్‌లో గురువారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.3% కేటాయించిందని, ఇది గత ఓటాన్ బడ్జెట్ కంటే కూడా తక్కువ అని తెలిపారు. గత బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కోట్లు కేటాయించిందని, ప్రస్తుతం రూ.21,292కోట్లు కేటాయించారని చెప్పారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య ఏ మాత్రం అభివృద్ధి కాదని అన్నారు. గురుకులాల నిర్మాణానికి కనీస నిధులు లేవని, ఇప్పటికే రాష్ట్రంలో 800లకు పైగా గురుకులాలకు సొంత భవనాలు లేవని తెలిపారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బానోత్ వినోద్ కుమార్, నాయకులు అక్కనపల్లి వినయ్, వేణు, అరుణ్, సాయి, గోపి, నవ్య, సౌజన్య, మమత, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా, నిరుద్యోగ అంశాలను గాలికొదిలేసిన ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా, నిరుద్యోగ అంశాలను గాలికొదిలేసిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ గురువారం ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిరుద్యోగులు, విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారని, కానీ బడ్జెట్‌ను చూస్తే ఉసురుమనేలా ఉందని తెలిపారు. ఏ అంశంపై కూడా స్పష్టమైన విధివిధానాలను, పాలసీలను ప్రకటించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 30శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు.

భానుపురి : విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 7.3 శాతం నిధులు కేటాయించి నిరాశపరిచిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల అజయ్, సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ గురువారం పట్టణంలోని 60 ఫీట్ల రోడ్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తక్షణమే బడ్జెట్ అంచనాలను సవరించి విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు విజయ్ రెడ్డి, తరుణ్, అరుణ్, ప్రసాద్, లక్ష్మణ్, ఆంజనేయులు, రాము, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ ముందంజ



మద్దిరాల ప్రభుత్వ పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వం అందజేస్తున్న రేపాక లింగయ్య

మద్దిరాల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో డీటీఎఫ్ ముందంజలో ఉంటుందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య అన్నారు. మద్దిరాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతతో నిజాయితీగా పని చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం డీటీఎఫ్ అని అన్నారు. బదిలీ పొందిన ఉపాధ్యాయులందరిని వెంటనే రిలీవ్ చేయాలని అన్నారు. 317 జీఓ ద్వారా బదిలీ పొందిన ఉపాధ్యాయులకు సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.రాములు, ప్రధాన కార్యదర్శి బి.దేవేందర్, సీనియర్ నాయకులు దండు వెంకటనారాయణ, బుస్సా వెంకటేశ్వర్లు, వెంకన్న, చంద్రశేఖర్‌రెడ్డి, బొప్పని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. చిన్నపాటి చెరువే!



అర్వపల్లిలోని కేజీబీవీ ఎదుట నిలిచిన నీరు



కేజీబీవీ ఆవరణలో నీళ్లు నిలిచి పెరిగిన గడ్డి

- వర్షాలకు అర్వపల్లిలోని కేజీబీవీ ఎదుట నిలుస్తున్న నీరు
- వానాకాలం వచ్చిన ప్రతిసారి తప్పని ఇబ్బందులు
- నీళ్లు నిల్వకుండా చూడాలని కోరుతున్న విద్యార్థినులు, సిబ్బంది

అర్వపల్లి : చిన్నపాటి వర్షం కురిసినా అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం ఆవరణ జలమయం అవుతోంది. వర్షాలు పడినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుంది. దీంతో కేజీబీవీలో బాలికలతో పాటు టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విద్యాలయం గ్రామశివారులో జెడ్పీహెచ్ఎస్ పక్కన బోడు సమీపంలో ఉంటుంది. వర్షాలు పడినప్పుడు బోడు నుంచి వచ్చే వరద ఈ విద్యాలయంలోకి వచ్చి చేరుతోంది. గత కొన్నేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొంది.

చిన్నపాటి వర్షాలకే జలమయం..

అర్వపల్లిలోని కేజీబీవీ ఎదుట గతంలో కుంట ఉండేది. దీంతో ఈ ప్రాంతానికి ఇప్పటికీ కొంత వర్షపు నీరు వచ్చి చేరుతోంది. అయితే గతంలో ఈ నీళ్లు తీగల చెరువుకు వెళ్లేలా ఉండేది. కానీ ఇటీవల కొన్ని కట్టడాలతో నీళ్లు చెరువులోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యాలయం ఎదుట నీళ్లు నిలిచి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే వారం రోజులుగా ముసురుతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో కేజీబీవీ మునిగిపోతుందని జిల్లా, మండల అధికారులు పలుమార్లు విద్యాలయాన్ని సందర్శించారు. నీళ్లు నిల్వకుండా శాశ్వతంగా ఏర్పాట్లు చేయాలని బాలికలు, సీఆర్‌టీలు కోరుతున్నారు.

నీళ్లు నిల్వకుండా చూడాలి



వర్షాలు పడితే అర్వపల్లిలోని కేజీబీవీ ఆవరణలో నీళ్లు చేరి పిల్లలు ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఇంత వరకు పరిష్కారం కాలేదు. మళ్లీ వర్షకాలం వచ్చింది. చిన్నపాటి వర్షాలకే అప్పుడే నీళ్లు చేరుతున్నాయి. నీళ్లు ఆగకుండా చూడాలి.

– మచ్చ నర్సయ్య, ప్రభుత్వ విద్యాలయాల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అర్వపల్లి కేజీబీవీ వర్షాలకు నిండుతున్న విషయాన్ని ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రయత్నలు చేస్తున్నాం. గతంలో నీళ్లు సాఫీగా ఇక్కడ నుంచి చెరువుకు వెళ్లేది. కానీ ఇప్పుడు నీళ్లు ఆగిపోతున్నాయి.

– డి. సందీప్‌కుమార్, ఎంపీడీఓ

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



లింగంపల్లిలో లక్ష్మీనర్సు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : మండల పరిధిలోని మాచనపల్లి, లింగంపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల కుటుంబాలను ఎమ్మెల్యే మందుల సామేల్ గురువారం పరామర్శించారు. లింగపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మడ్డి పెదలింగయ్య తండ్రి లక్ష్మీనర్సు మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. దోసపహాడ్ గురుకుల పాఠశాలలో ఇటీవల మృతి చెందిన, మాచనపల్లి గ్రామానికి చెందిన కొంపెల్లి సరస్వతి కుటుంబ సభ్యులను, అనంతరం బోర చినముత్తక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ములకలపల్లి మల్సూర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పనులు పునరుద్ధరించాలి

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గకేంద్రంలో 100 పడకల ఆస్పత్రి పనులను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పనులను ప్రారంభించి నెలరోజులుగా ఆపేశారని తెలిపారు. బిల్లులను విడుదల చేసి ఆపిన పనులను ప్రారంభించాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల అమలుకు సరిపడా నిధులను కేటాయించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, గోపగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంపాస్ బాక్స్‌ల అందజేత



కంపాస్ బాక్స్‌లు అందజేస్తున్న దాత

నూతనకల్ : పేద విద్యార్థులు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకన్న అన్నారు. వెంకెపల్లిలోని కట్టా భద్రమ్మ రాజిరెడ్డి మెమోరియల్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన చూడి ఉపేందర్‌రెడ్డి–రోజా దంపతులు తమ కుమార్తె రిషికారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గురువారం రూ. 5వేల విలువ చేసే కంపాస్ బాక్స్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీశైలం, షాబుద్దీన్, అజ్మితుల్లా, రమేష్, శ్రీదేవి, చూడి మధుసూదన్ రెడ్డి, కుంట పవన్‌రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



తిరుమలగిరి : రాఘవపురంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓ

తిరుమలగిరి : రాఘవపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వెంకటయ్య, సాధిక్ హుస్సేన్‌లు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం వారిని రాఘవపురం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.అశోక్, రామ్‌ధన్, సీఆర్‌పీ సోమేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ అమృత పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

అర్వపల్లి : అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు ఉంటుందని మండల విద్యాధికారి బాలు నాయక్ అన్నారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో బదిలీ అయిన, పదోన్నతిపై వెళ్లిన, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు గురువారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిర, పీడీ సోమయ్య, ప్రసన్నకుమారి, ఉమ, రాజ్యలక్ష్మి, లింగస్వామి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, మంజుల, సైదులు, జె. పురుషోత్తం, మల్లిక, జ్ఞానేశ్వరి, సంపత్‌కుమార్, రమేష్, ఫజల్, వెంకటేశ్వర్లు, సైదులు, కిశోర్‌కుమార్, రజిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు

అర్వపల్లి : మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపురం క్లస్టర్ ఏఈఓ నేరెళ్ల సత్యం గ్రామంలో క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల వారీగా పంటల వివరాలను తెలుసుకొని నమోదు చేసుకున్నారు. రైతులు తప్పనిసరిగా తాము సాగు చేసిన పంటల వివరాలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎస్కె.గౌసుద్దీన్, ఉగ్గం లింగరాజు, పగిళ్ల శంకర్, ఉగ్గం నాగరాజు, ఎస్కె.జానిపాష తదితరులు పాల్గొన్నారు.



వివరాలను నమోదు చేసుకుంటున్న ఏఈఓ

పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలి



చివ్వెంలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీయూపీఎస్ నాయకులు

చివ్వెంల : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలని టీయూపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని బీబీగూడెం, కొండల రాయినిగూడెం, బి.చందుపట్ల, తిమ్మాపురం, మోదిన్‌పురం, ఖాసీంపేట, దురాజ్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలను శుభ్రం చేసేందుకు కార్మికులు లేకపోవడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. దీని వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్, లింగపల్లి హరిప్రసాద్, పోతుగంటి శ్రీనివాస్‌రావు, క్రిష్టారెడ్డి, కోటిరెడ్డి, కళారాణి, మణి, నాగలక్ష్మి, సుజాత, హరిత, రామారావు, నిర్మల, వరలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నాటి పోరాట స్ఫూర్తే నేటి ఉద్యమాలకు నాంది



మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

నూతనకల్ : భూస్వామ్య, పెత్తందార్లకు వ్యతిరేకంగా కొనసాగిన నాటి పోరాట స్ఫూర్తే నేటి ప్రజా ఉద్యమాలకు నాంది అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం సీపీఐ జిల్లా సమితి సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన నూతనకల్, మద్దిరాల మండలాల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి ప్రాంతంలో అనేక మంది తమ ఆస్తులను దానం చేసి పేదల పక్షాన పోరాడారని తెలిపారు. పాలకవర్గానికి, ప్రజలకు మధ్య కమ్యూనిస్టులు నిర్వహించిన ఉద్యమాలే సమస్యల పరిష్కారానికి దారిచూపాయని తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి రైతులు దేశ్‌ముఖ్‌ల వద్ద కొనుగోలు చేసిన భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య, కంబాల శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, యానాల వెంకట్‌రెడ్డి, సదానందం పాల్గొన్నారు.